# ఆశలబందీ

ఆశల బందీ మధ్యతరగతి మనిషి!
అశోపహతుడు మధ్య తరగతి మానవుడు!
బలహీనతల నిధి మధ్యతరగతి ప్రతినిధి!
బ్రతుకు భ్రమల బేహారి మధ్య తరగతి కలల విహారి!
మానవత్వం జీవించీ మరణించిన మానవుడు మానవుడు!
అతని జీవితం ఆశల ఒంటి స్తంభంపై నిర్మించిన గాలి మేడ!
అది అతని మనస్సుకి విశ్రాంతి యిచ్చే మేడ!

✧ ✧ ✧

ఒక్కసారి ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంటుంది. పాలసీ పేర తీసుకునే ఆ నిర్ణయాలు కొందరి జీవితాలని ఎంతగా మార్చేస్తాయో చట్టం చేసే ఆ అధికారులకి తెలీదు. ఒకే వూళ్లో చాలా సంవత్సరాలు ఉద్యోగం చేస్తున్నవాళ్లని బదిలీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం చిదంబరానికి ఆ వూరినుంచి తాలూకా హెడ్ క్వార్టర్స్‌కి బదిలీ అయింది. అతను ఉద్యోగంలో చేరిన ఇరవై రెండేళ్లకి మొట్టమొదటిసారిగా బదిలీ వచ్చింది.

నిజానికి చిదంబరానికి స్వంత వూరంటూ ఏదీ లేదు. అతను ఎక్కడ పుట్టేడో అతనికే సరిగ్గా తెలీదు! బుద్ధి తెలిసీ తెలియని వయస్సులోనే అతను హాస్టల్లో చేరాడు. చేర్చేక. అతనికి మాస్టార్లు చెప్పిన మాటలు గుర్తున్నాయి బాగా.

"బాబూ! ప్రభుత్వం మీకోసం ఎన్నో చేస్తోంది! ఎంతెంతో ఖర్చుచేస్తోంది. ఎన్నో సౌకర్యాలు కలిగిస్తోంది. ఫీజులు లేకుండా చదువు చెబుతున్నారు. తిండి పెడుతున్నారు. దుస్తులు కుట్టిస్తున్నారు. చదువుకున్నాక రిజర్వేషన్స్ కల్పించి ఉపాధికల్పిన కూడా చేస్తోన్నారు. ఇంతకంటే ఏ తల్లీతండ్రీ ఏ కొడుకు కోసం చేస్తారు.

మీరు ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోకండి! సద్వినియోగం చేసుకోండి. బాగా చదువుకోండి! మంచి మార్కులు తెచ్చుకోండి!"

ఆ మాటలు చిదంబరం మనస్సులో శిలాక్షరాలుగా నిలిచాయి. అందుకే అతను చదువుకున్నన్ని రోజులూ హైస్కూల్లో, కాలేజీలో స్టయిఫండ్, స్కాలర్‌షిప్ మెరిట్

స్కాలర్ షిప్ లాటివి వుంటే అవి అతనికి తప్పనిసరిగా దక్కాలి! దక్కేవి.!

శ్రద్ధగా చదువుకోవటం, ఫస్ట్‌గ్రేడ్‌లో వుండటం, ఫస్ట్‌రాంక్‌లో స్కూలు ఫస్ట్ రావటం చిదంబరం సాంకేతిక లక్షణాలు, చిరునవ్వు చెరక్కపోవటం, వినయంగా మాటాడటం, టీచర్ల పెద్దల అభిమానాన్ని సంపాదించటం అతని చిహ్నాలు, పదుగుర్లో వున్నా ఒకడిగా గుర్తింపబడటం అతని ప్రత్యేకత! ఒకడిగా వున్నా లెక్కింపుకి రావటం అతని జీవలక్షణం.

చదువు పూర్తయింది. ఉద్యోగం వచ్చింది. మొదటినుంచీ ఇతన్ని గమనిస్తోన్న ఓ పెద్దమనిషి తన కూతుర్నిచ్చి చేశాడు. భార్యతో తొలి సారిగా ఆ వూళ్లో అడుగుపెట్టాడు చిదంబరం.

పదప్రవేశం అయిన రోజున ఆ వూరి పెద్దల్ని, గ్రామాధికారుల్ని, ఎంతగా మెప్పించి మనస్సు చూరగొన్నాడో - యీ యిరవై రెండేళ్లలోనూ అతనూ అతని భార్య పిల్లలు దాన్నలాగే నిల్పుకున్నారు.

యోగ్యుడు, నెమ్మదైనవాడు, మంచి వాడు అనే కితాబు సంపాదించుకున్నాడు. చిదంబరం. దాన్ని పదిలంగా పిత్రార్జితం లాగా కాపాడుకున్నాడతను.

అధికారంలో, అధికారుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. ప్రెసిడెంట్లు సర్పంచులుగా మారిపోయారు. బ్లాకులు, సమితులు అయ్యాయి. బోర్డులు పరిషత్తులయ్యాయి. అయితేనేం చిదంబరం జీవనగతిలో మార్పు లేదు. ఆ వచ్చే కొద్దిపాటి జీతంలోనే అతనూ భార్య, ముగ్గురమ్మాయిలు, ఇద్దరబ్బాయిలూ పొందిగ్గా బ్రతకటం నేర్చుకున్నారు. ఆ ఘనత చిదంబరం భార్యామణికి మాత్రమే చెందదు. ఉన్నదాన్లోనే కాలుముడుచుకుని పడుకోవాలన్నది చిదంబరం సిద్ధాంతం. అది ఇంటిల్లిపాదికీ నేర్పించాడతను.

✧ ✧ ✧

బావిలో నుంచి చెరువులో పడ్డట్టయింది యిపుడు. అంతకుముందు మను మంచిపల్లెలో కాపురం .ఇంటి బాడుగ చాలా స్వల్పం. నామకేవాస్తే పదిరూపాయలు. పాలకి నెలకి నాలుగు రూపాయలు! కూరానారా వూరికే దొరికేవి. చిదంబరం యింటికి కాయగూరలు తెచ్చివ్వటం సేవగా భావించేవాళ్ళు. వంటచెరుక్కి ఏనాడూ యిబ్బంది పళ్లేదు. కొన్లేదు. మోపులు మోపులు తెచ్చి పడేసేవారు, రూపాయి కిరోసిన్‌తో ఇల్లు వెలిగేది.

ఇక యిప్పుడో! అమ్మబాబోయ్!గాలి పీలిస్తే డబ్బు! విడిస్తే డబ్బు!పాలు లీటర్ మూడూ, నాలుగూ!మజ్జిగకే(పెరుక్కికాదు) రోజుకి అరలీటరు పాలు కావాలి.కరెంటుకి శ్లాబ్ చార్జీ పదిరూపాయలు, ఇంటి అద్దె ఎనబయ్ రూపాయలు. వంటచెరుక్కి నెలకి ముప్పై చాలటంలేదు. కూరగాయలకి రోజు రూపాయ రూపాయిన్నరా తగలేసినా జిహ్వాకి రుచిగా తగ్గటంలేదు.

ఏం బ్రతుకులు

పట్టణాల్లోనే యిలా అయితే సిటీల్లో ఎలా బతుకుతున్నారో అనుకున్నాడతను. పిల్లకాలువ నించి సముద్రంలోకి కొట్టుకొచ్చినట్టుగా వుంది స్థితి. వచ్చే జీతంలో మార్పులేదు. పెరిగిన ఇంటి అద్దె అలవెన్స్ ఏమూలకి వచ్చేట్టు! బ్రతికే తీరులో మాత్రం ఎంతో మార్పొచ్చింది! ఎలా లంకె కుదుర్చుకునేది?

డబ్బు!డబ్బు ! డబు!

ఎక్కడ చూసినా డబ్బుతో అవసరం. ఎటుచూసినా డబ్బు కల్పించే అవసరాల నాట్యం. పిల్లలంతా హైస్కూల్లో, జూనియర్ కాలేజీల్లో చదువుకుంటున్నారు. ఎక్కడా తప్పటంలేదు. మార్కులు బాగా వస్తున్నాయి. ఇక చదువు వద్దనేదెలా? ఎవరిని మాన్పించేట్టు అమ్మాయిలయితేనేం చదవనక్కర్లేదా?

ఆళ్ళగడ్డ వచ్చాక పిల్లలతో మరో రెండు గొడవలు ఎక్కువ అయ్యాయి. స్కూలు డ్రస్సు అంటూ తలా రెండు మూడు జతల గుడ్డల ఖర్చు. ఆవూళ్లో యీ పట్టింపు లేదు. రూల్సు వున్నా పల్లెల్లో పాటించేదెవరు? రెండో గొడవ సినిమాలు! వీధి వీధి అంతా రోజూ సినిమాలయాలకి -వెళ్ళి అభిమాన నటీనటుల్ని దర్శించుకుని వస్తాంటే లేత మనసుల్ని ఆపేదెలా?

అవసరాలు రెట్టింపు అయ్యాయి.

ఆదాయం మాత్రం అంతే వుంది.

జీతం డబ్బులు మొదటిరోజు పర్సు నిండుగా వుంటాయి. రెండోరోజు పదుల్లో- మూడురోజున ఒకట్లలో నాలుగోరోజు చిల్లర క్రింద అయిపోతున్నాయి.

ఎవరితో చెప్పుకునే బాధ యిది.

పెరిగిన జీవన వ్యయంతోపాటు పెరగని జీతంయిచ్చే యాజమాన్యాన్నా? అది ప్రభుత్వ రీతి. దాన్నే మనగలం? ఎలా మనగలగటం?

మారిపోయిన ఆర్థిక పరిస్థితుల్నా?

వాటికి బాధ్యులెవరు?

ఈ పరిస్థితి మారేదెలా?

మార్చేదెవరు?

✧ ✧ ✧

ఆరోజు సహ ఉపాధ్యాయుడు సాయంకాలం ఆరింటికి ఏదో చార్టు గబగబా తిరిగేస్తూ, గుణింతం, గణితం, రీడింగ్ చేస్తూ ఏవేవో అంకెలకి ఎదురుగా పది ఇరవై రాసేస్తున్నాడు.

చిదంబరం దగ్గరగా వెళ్లేడు.

మేనక వచ్చినా చలించని ధీరత్వంతో ఉన్న విశ్వామిత్రుడిలాగా చార్టులో మునిపోయాడు చిదానందం.

'ఏమిటి?' పక్కనే కూర్చుంటూ అడిగాడు చిదంబరం.

ఆ ప్రశ్నకి చిదానందంగా నవ్వి "డబ్బు సంపాదించే సులువైన మార్గం" అన్నాడతను.

తొలిసారి సినిమాతారని అతి దగ్గర్లో చూసిన పల్లెటూరి అర్భకుడిలా, జీవితంలో మొట్టమొదటిసారిగా ఎలక్షను మీటింగులో ప్రధానిని చూసిన గిరిజన మహిళలా అయ్యాడు చిదంబరం.

'డబ్బు అంత సులువుగా వస్తుందా?'

'అందరికీ రాదు, ఈ రీడింగ్ తెలిసి వుండాలి. ఈ రన్నింగ్ తెలిసి వుండాలి ఓపన్ని, క్లోజుని పట్టుకోగలగాలి. అబ్బా అదో యజ్ఞంలే! నీ కెందుకు?

జేబులోంచి పదిహేను పైసలు తీశాడు. తనూ రాశాడు. ఊహూ, అతనితో రాయించాడు.

'ఇంతేనా? పెదవి విరిచాడు.

'జీతంలో మిగిలిందిది' పేలవంగా నవ్వేడు చిదంబరం.

ఆ మురుసటిరోజు ఉదయం ఆ ఇంట్లో లక్ష్మీదేవి గలగలలతో మొదలయింది. ప్రొద్దున్నే పన్నెండురూపాయలు తీసుకుని వచ్చాడు చిదానందం. 'ఇదిగో నీ డబ్బు' అంటూ యిచ్చాడు.

'బ్రాకెట్ వచ్చిందా?' ఆత్రంగా అడిగాడు.

నంబర్ తగిలింది?

'నీకు రాలేదా?'

'నాకు ఎనిమిదొందలు వచ్చింది?' అన్నాడతను గర్వంగా.

చిదంబరం నోరు తెరిచాడు ఆశ్చర్యంగా.

చిదానందం వెళ్ళిపోయాడు.

చిదంబరం జీవితంలో సులువుగా డబ్బు సంపాదించాలనే ఆరాటం మొదలైంది.

'అది తన కోసమేమిటి?

తనకేం కావాలి? ఏమీ అక్కర్లేదు.

తన భార్యా బిడ్డలు సుఖంగా వుండాలి. వాళ్ళ సంక్షేమం కోసం డబ్బు సంపాదించాలి. అంతే! వాళ్ళు కడుపు నిండాలిని, కంటినిండా నిద్రపోయి, వంటినిండా మంచి గుడ్డ కట్టుకోవాలి. పిల్లలు బాగా చదువుకుని యోగ్యులు కావాలి?" అనుకున్నాడతను.

బిగినర్స్ లక్ బాగా పనిచేసింది. రోజూ బ్రాకెట్టు, ఓపనో, క్లోజో ఏదో ఒకటి 'తగుల్తోంది' అంతో యింతో డబ్బులొస్తున్నాయి.

కానీ బిగినర్స్ లక్ ఎన్ని రోజులు?

వారం తిరిగేసరికి మొక్కలాటి ఆశ వటవృక్షమై కూర్చుంది. అప్పైనా చేసి

ఆడాలన్నది ఆటగాళ్ళ సిద్ధాంతం. ఆ అబ్బిందతనికి. రోజులు గడిచిపోతున్నాయి. మెల్లిమెల్లిగా చేబదుళ్ళ స్థాయి ప్రాంసరీ నోట్ల లోకి అభివృద్ధి చెందింది.

అపుడున్న పర్లేగా ఆ రోజుల్లో అప్పడగాలంటే నామోషి అయినా అప్పు అడిగే అవసరమూ రాలేదేనాడూ. ఈవూళ్ళో ఎక్కడ చూసినా అప్పులే! అప్పులు! అప్పులు! బట్టల కొట్లో, పచారీ కొట్లో.....పత్తుల పద్ద........

తన పరపతి పెరిగిందనుకున్నాడు. చిదంబరం.

✧ ✧ ✧

చాలా రోజుల త్వాత

ఆ రోజు ఒక్కసారిగా పాతిక రూపాయల 'కుండలీకరణ' అదే బ్రాకెట్-చిదంబరాన్ని నేతలా అనుగ్రహించింది.

ఒక్కసారిగా రెండువేలు!

అమ్మబాబోయ్! దాదాపు మూడు నెలల జీతమంత! ఎన్నడూ యింత డబ్బు ఏరా చూళ్లేదు- నెలంతా గొంతుచించుకుని అరిచినా వచ్చేది బొటాబొటీగా ఎనిమిదొందలు! అదే యిప్పుడు! ఒక్కపూటలో - సాయంకాలంనుంచి ఉదయం లోగా రెండువేలు-అదృష్టంలాగా వచ్చేయి.

ఇలా వారానికోసారి వస్తే?

నెలకి రెండు నాలుగులు ఎనిమిది వేలు...సంవత్సరానికి దాదాపు లక్ష ఎప్పటి కప్పుడు బ్యాంక్ లోనో వడ్డీకో యిస్తే లక్షకి మరో అరలక్ష...పదేళ్ళు గడిస్తే అసలే పది లక్షలు. వడ్డీ మరో పదిహేను. పాతిక లక్షలు....తను రిటైరయ్యేనాటికి పాతిక లక్షల ఆస్తి.

స్వంత యిల్లు కట్టుకోవాలి. కొంత పొలం కొనుక్కోవాలి. తిండికి చాలినన్ని బియ్యం రావాలి. దాన్లో పాడీ పంటా యిల్లూ ఒహ్.....అంతకంటే యింకేం కావాలి....తను తప్పక సాధించాలి"

చిదంబరం తాను టెన్సింగ్ -హిల్లరీల వారసుడ ననుకున్నాడు.

"గుడ్ లక్! ఆ నంబర్ నాకూ చెప్పివుంటే నేను పంద ఆడేవాడిని. దశరథ్ వెయ్యి రూపాయలు వేసేవాడు."

ఆ మాటవిని నిర్ఘాంతపోయాడు చిదంబరం. 'అంత ఆడ్తారా.'

వెర్రివాడిని చూసి నవ్వినట్టుగా నవ్వేడతను. 'బొంబేలో కొందరు ఓపన్ కి లక్ష-క్లోజ్ కి రెండు లక్షలు ఆడ్తారు తెలుసా? అసలు డబ్బు లెక్కపెట్టరు, నువ్విచ్చిన డబ్బు కట్టపై నీ నంబర్ వేసి ఓ మూలకి విసిరేసి నీ స్లిప్పై సంతకం చేస్తారు. తగిలినప్పుడే చూసి యిచ్చేది. డబ్బు తీసుకునే బుక్కింగ్ కౌంటర్లోంచి డబ్బంతా ఓ గదిలోకి విసిరేస్తారు. అది రిజర్వ్ బ్యాంక్ స్ట్రాంగ్ రూంలా వుంటుంది!" అన్నాడు.

అది విన్న చిదంబరం పాతిక లక్షల కోసం పదేళ్ళు ఆగాలనుకున్న తన అజ్ఞానాన్ని నిందించుకున్నాడు.

అదృష్టం వరిస్తే లక్షలకి లక్షలు రోజుల్లోనే వస్తాయి. అంతా రన్నింగ్ చూసి నంబర్ తీయటంలో ఉంటుంది. తను ఓ మంచి రన్నర్‌ని పట్టుకోవాలి' అనుకున్నాడు.

"మరి విందు!"

"విందా!"

"ఆఁ మందూ- మజా!" అన్నాడు చిదానందం.

తర్వాత చిదంబరం ఊహు అంటున్నా అతను విన్లేదు. విందా- మందూ రెండూ రుచి చూపించాడతనికి.

తొలిసారిగా విస్కీ గొంతు దిగుతూ వుంటే ఆకాశాన మబ్బుల్ని చూసి పురివిప్పిన నెమలిలా అయింది అతనికి మనస్సు. బాధ, సంతోషం జమిలిగా ఎలా ఉంటాయి. కష్టం, సుఖం కలిసి కట్టుగా ఎలా జీవిస్తాయి.

అవి మందు మజాలో వుంటాయనుకున్నాడతను.

✧ ✧ ✧

ఆరోజు పొద్దుపొడవటమే మహా దుర్మార్గంగా పొడిచింది. ప్రతిరోజూ కల్లుపాక చూడందే బ్రతకలేని తాగుబోతు బ్రతుకులా మబ్బు కమ్మేసింది. తొలిసారి తాగినవాడు భార్యాబిడ్డలకి ముఖం చూపించలేక చాటేసినట్టుగా సూర్యుడు మబ్బుచాటుకి ముఖం చాటేసినట్టుగా చాటేసుకున్నాడు.

అప్పు తీర్చలేని తాగుబోతువాడింటి మీద అప్పుదార్లు దాడిచేసినట్టు ఆకాశం నిండా మబ్బులు బైఠాయించాయి. తాగుబోతు బుడిబుడి ఏడ్పులు ఏడ్చినట్టుగా అడపాదడపా చినుకులు రాలుతున్నాయి.

చిదంబరానికి రాత్రి హేంగోవర్ యింకా తగ్గలేదు. అలాగే నిద్రలేచాడు. రాత్రి చేసిన తప్పుడుపనికి తనలో తనే సిగ్గుపడ్డాడు. మజా చేయమన్నందుకు చిదానందాన్ని చేసుకున్నందుకు తనని తిట్టుకున్నాడు.

ఆ రాత్రంతా గాబరాగా గడిపింది మణి. పిల్లలు తెలిసినచోటనల్లా వెదికి వచ్చారు. అక్కడికి వెళతాడు అని ఆమాకీ తెలిసినచోటుకల్లా వెళ్లొచ్చారు. అయినా చిదంబరం ఎక్కడుండేదీ చిదంబర రహస్యమే అయింది.

'ఆయన్ని' అల్లంత దూరాన చూడగానే మణి ముఖం మణిదీపమైంది.

'రాత్రంతా' మాటాళ్లేదు. జేబులో మిగిలిన డబ్బు యిచ్చాడు.

"పద్దెనిమిది వందలు" లెక్కపెట్టింది మణి.

ఎర్రబడిన కళ్లు-పీక్కుపోయిన ముఖం అలవాటు లేక సిగ్గు-

భర్తముఖం చూసి ఆశ్చర్యపోయిందామె.

"ఏమైంది అలా వున్నారు? డబ్బెక్కడిది?"

"ఎక్కడిది? ఎత్తుకొచ్చా? ఇస్తే దాయక -ఏం ప్రశ్నలు?"

కస్సుమన్నాడు చిదంబరం- తొలిసారిగా జీవితంలో భార్యపై నోరుచేసుకున్నాడు.

గుప్పుమంటున్న వాసనని చేత్తో ఆపుకున్నాడు.

భర్తని పరీక్షగా చూసిందామె "తాగేరా" స్థిమితంగానే అడిగింది.

కస్సుమన్నాడు చిదంబరం. "తప్పేంతప్పేం తాగితే? ఏదో అనుకోకుండా దండిగా డబ్బొచ్చింది అందరం కలిశాం జల్సా అన్నారు. కాదనేదెలా? బలవంతం చేస్తే గుక్కెడు-"

ఆ మాటలంటున్నపుడు తనకి కళ్లెదురుగా క్వార్టర్ బాటిల్ విస్కీ మెదిలింది. అరకోడి కదలాడింది.

నోట్లో పైట చెంగు కుక్కుకుందామె. పిల్లల ముందు 'వాదు' వద్దనుకుంది అయినా గతించిన దాని గురించి పోట్లాడితే ఏం లాభం?

భార్యను లొంగదీశాననుకున్నాడు అతను. అలవాటుమనిషిని జయించినట్టు-

ఒక్కసారిగా రెండువేలు రావటంతో ఆశ ఎక్కువైంది. వచ్చినా రెండువేలూ నెల తిరక్కుముందే ఎక్కడినుంచి వచ్చాయో అక్కడికి వెళ్లాయి 'పంచాగ్ని విద్య'లో జీవుడిలాగా.

అప్పు చేస్తున్నాడు. కొత్తగా అలవాటైన పేక ఆడుతున్నాడు. ఆరు నెలల జీతం అడ్వాన్సుగా తీసుకున్నాడు. ఫెస్టివల్ ఎడ్వాన్సులు, లోన్లు ఎప్పుడో అయిపోయాయి. ఓపన్ రాకపోతే కలిగే బాధ ఎలా తీరాలి! అందుకే 'మజా'లో అలవాటైన మందుని 'సేవిస్తున్నాడు'

డబ్బు వచ్చినా రాకున్నా రోజూ 'మందు' కొడుతున్నారు. అది బాగా అలవాటైంది. దాన్ని విడువలేదు. దీన్ని వదల్లేదు.

ఆశ! ఆశ!

ఎప్పుడో జాక్‌పాట్లో.పోయిన డబ్బంతా పేకాటలో తిరగొస్తుందని? ఎప్పుడో బ్రాకెట్స్ తగుల్తాయి; పోయిన డబ్బుల్లా వచ్చి 'లక్షల' కధికారి అవుతానని!

ఆకాశ హర్మ్యనిర్మాణానికి ఆశలు పునాదులు-కలలు గోడలు....కోరికలు పైకప్పులు.గుడ్డి నమ్మకం అలంకరణలు......ఎప్పుడు పూర్తవుతుందా మేడ?

✧ ✧ ✧

ఆరునెలలు గడిచాయి.

రోజూ బ్రాకెట్ అందినట్టే అంది ఆశలు పెంచి ఆదిలోనో, అంతంలోనో తన్నేస్తోంది. మనసుకి కలిగిన బాధ పోయేందుకు క్వార్టర్ ఖాళీకాక తప్పటం లేదు. పేకలో జాక్‌పాట్ తన్నేస్తోంది. రౌండ్‌లో ఒకటోరెండో గెలిస్తే, మిగతా అన్నీ పెనాల్టీలు. జాక్‌పాట్‌లో ఆల్ కౌంట్ తప్పటంలేదు. ఆశ అంతా జాక్‌పాట్ మీదే మరి. షో చేస్తే నాలుగొందలొస్తాయి.

కానీ అది తప్పుతోంది. మసాలా కరిగిపోతోంది.

అప్పులు మనిషిని మంచులా కమ్మేస్తున్నాయి. మబ్బుల్లా ముసురు చేస్తున్నాయి.

నలుగురిలో మునుపటిలా తిరగలేడు. మాట్లాళ్లేడు. సిగ్గు, బెరుకు, చేతకాని తనం తెచ్చిన అవమానం. ఆవహించిన అనికరం. అలవాటుని చంపుకోలేని బలహీనత. ఇప్పుడు ఏ విధంగా చూసినా వెనక్కి వెళ్లలేని ఆశచేసిన చెరుపు.

చుట్టూ ముళ్లకంచెలా కమ్ముకున్న పరిస్థితులు.

ఓ రోజు సాయంకాలం......బస్టాండులో తెలిసిన ముఖాన్ని అప్పు అడగటానికి వెళ్లి వస్తున్నాడు.

అప్పుడు కలిశాడు మనుమందిపల్లె మిత్రుడు.

సంస్కారణలేని జుత్తు. పీక్కుపోయి కళాకాంతులు నశించిన ముఖం గాజు గోళాల్లా వున్నకళ్ళు. మాసిన చొక్కా శ్రద్ధలేని జీవితంలాగా ముఖంనిండా నైరాశ్యం.........

"మువ్వు నువ్వేనా" ఆశ్చర్యంగా అడిగాడతను.

చచ్చిన చావైంది చిదంబరానికి.

"ఏందిట్లా తయారైనావ్? మామూళ్లో చెబ్తే నేన్నమ్మలా? ఏందిది సార్? రోజూ మట్కా ఆడ్తున్నవంట గదా? తాగుతవంట గదా? ఇస్పేటు ఆడ్తున్నవంటగదా? అన్నీ అప్పుల్జేసినావంటగదా? మొన్న సుబ్బారెడ్డి కనిస్తే అప్పడిగినావంట గదా? పట్టపగలు సూర్యుడిని కమ్మేసిన చిక్కని మబ్బులో వడగళ్ళవాన కురిసినట్టుగా అడిగాడతను.

నోరెత్తలేదు. చిదంబరం. తల దించుకున్నాడు. తనకంటే వయసులో, చదువులో, యోగ్యతలో అన్నిటా చిన్నవాడు యీ రోజు యిలా నడిరోడ్డులో నిలేసి నిర్దిశి ప్రశ్నిస్తోవుంటే.......

"సార్! ఎంత బాగుండినవ్ నువ్వు? అప్పటికి యిప్పటికి ఎంత యత్తాశం! ఇదేంది యిల్లా చెడిపోయినవ్? ఈ వూరొచ్చి పాడైపోయినవ్ సార్! నీకు డబ్బాశ ఎందుకు పుట్టిందిసర్! ఎవర్నేర్పినార్ సార్ యిది? ఇట్టయితే నీ పిల్లలేం గావాల? ఆమేం గావాల? ఎట్లాబతుకుతారు?

దించిన తలెత్తలేకపోయాడు ఉత్తమ ఉపాధ్యాయుడు.

"సార్! తలారిపెద్దన్న తాగుతుంటే బుద్ధిచెప్పిమాన్పించినావ్! మాదిగెంకడు తాగి దొంగతనాలు చేస్తుంటే బుద్ధిచెప్పి మాన్పించినావే? నువ్విట్లా ఎట్లయినావ్ సార్! ఒకరికి చెప్పేవాడివి నువ్విట్లా చెప్పించుకోవాలా?"

చిదంబరానికి పాతాళానికి దిగడిపోతున్నట్టుగా వుంది.

"పిల్లల చదువు లెట్లా? పెండ్లిండెట్లా అస్సలు నువ్వేందిట్లయినావ్! నీ ఆరోగ్యమేం గావాల? ఇది బాగలేదు సార్? నువ్వు మళ్ళా మనూరికి మార్పించుకో!"

చిదంబరం తలూపేడు.

"కాఫీ తాగుదాం రాసార్!"

జేబులో ఏమీ లేదు. అందుకే నంబరు రాయించటానికీ, పేకలో చేయి కలపటానికీ, సినా సీలు తీయటానికీ అన్నిటికీ బదులు కోసం వెళ్లేడు. అప్పైనా సరే అని వెళ్లేడు. కానీ కీర్తి దిగంతాలకి పాకింది. అప్పు పుట్టలేదు ఇప్పుడు హోటలుకి ఎలా వెళ్ళాలి!

'రా సార్! కాఫీ తాగుదాం, బిల్లునేనిస్తా!"

కబేలాకి మేక వెళ్లినట్టు వెళ్లేడు.

టిఫినయింది. తృప్తిగా తిని ఎన్నాళ్లయిందో! కాఫీ తాగేరు.

"సార్! మనూరికి రా! పొలంగుత్తకు తీస్కో. ఎవరో ఒకరం మేం పండిస్తాం అప్పులు తీర్తాయి. ఇంత పొలం కొనుక్కో! నేను యింటికి స్థలం యిస్తా! కొట్టం యేస్కో! నీ కింకేం ఖర్చుంటది. పిల్లల్ని బాగా చదివించు."

"అలాగే!" గొంతు పెకిలింది చిదంబరానికి.

"వస్తా సార్! నీకు నేను చెప్పేటంతోణ్ణికాదు. నీకాడ చదువుకున్నా నాకు బుద్ధిచెప్పినవాడివి. అదే నా బాధ" వెళ్లిపోయాడు అతను.

మరణశిక్ష విధించినట్టుగా బాధపడిపోయాడు చిదంబరం.

✧ ✧ ✧

ఆరోజు సాయంకాలం. ఆరుగంటల నుంచీ బాధపడుతున్నాడు మథనపడుతున్నాడు. 'ఇక లాభం లేదు. ఈ అప్పులు తీరవు! ఒకటా రెండా? పాలిక వేలు? ఈ అప్పుతీర్చటానికి తనకేముంది? ఇల్లా వాకిలా? ఆస్తా? ఎట్లా తీర్చాలి అప్పు? ఇక ముందు జీవితం ఎలాగా?

చిన్నరెడ్డి మళ్లీ పల్లెకి రమ్మన్నాడు. ట్రైచేస్తే ట్రాన్స్‌ఫర్ రావచ్చు. కానీ ఏ ముఖం పెట్టుక వెళ్లాలి? అక్కడ అందరూ దోషిని చూసినట్టు చూస్తారు. దాన్ని భరించేదెలా?

ఈ బతుకు బాగుపడదు. బ్రాకెట్లో డబ్బురాదు. అదెప్పుడో తెలిసిపోయింది. అప్పుడప్పుడు ఆశ కల్పించటానికి వచ్చింది. తను ఆ ఆశకే బందీ అయ్యాడు. నిజంగా డబ్బొచ్చే అంత అదృష్టమే వుంటే ఎప్పుడో వచ్చేది! పేకాటలో డబ్బు అసలే రాదు. అసలు తనకి ఆట బాగా వస్తే కదా! వచ్చేదయితే ఎప్పుడో వచ్చేది కాదా! ఏదో వస్తుందనే ఆశతో వేలకి వేలు తగిలేశాడు.

కూతుళ్ల పెళ్లిళ్లెట్లా చెయ్యాలి? కొడుకుల చదువుల మాటేమిటి? తమిద్దరి బ్రతుకుమాటేమిటి?

రోజూ యీ వేళ అయ్యేసరికి నంబర్రాయందే మనస్సూరుకోదు. ఆ సమయానికి ఏదో రన్నింగ్- ఎవరో చెప్పిన నంబరు. ఆశ...అదీ తన దారిద్ర్యమంతా తీరేంత రావాలనే ఆశతో రాయటం. అటునుంచి అటే పేకాటకి పొద్దుపోదని ఊరకే మిష.

ఓపెన్ చూసుకునే దాకా పేకాట అంతదాకా క్లబ్బులో పెగ్గు మీద పెగ్గు. ఆ తర్వాత బాటిల్. క్లోజు చూసుకునే దాకా తాగుతూ వుండటమే!

ఈ దినచర్యలో మార్పులేదు. రాదు!

తను మారడు. మారలేడు. ఇదింతే! చావొచ్చేదాకా- అప్పులు పుట్టటం ఆగేదాకా- యింతే!

దీనికి ఒకటే పరిష్కారం.

నిశ్చయించుకున్నాడతను.

✧ ✧ ✧

హైరోడ్డు వెంట వెడుతున్నాడు చిదంబరం.

ఊళ్లో వుంటే బుక్కర్, క్లబ్, బార్ నిలవనివ్వవు. నించోనివ్వవు. అందుకే నిలవకుండా నడుస్తోపోతున్నాడు 'గమ్యం లేని పయనం

ఊహూ,

ఇది గమ్యంలేని పయనంకాదు దీనికి గమ్యం వుంది......

అప్పుడు దాదాపు తొమ్మిదిగంటలు ఆకాశంలో మబ్బులతో దోబూచులాడుతున్నాడు చంద్రుడు. ఒకటి అరా నక్షత్రాలు ఓపెన్-క్లోజుల్లాగా అర అరగా అలా అలా మెరుస్తున్నాయి.

ఎదురుగా ఏదో లారీ వస్తోంది. తాగిన వాడు తూలుతూ, తూగుతూ, సోలుతూనడుస్తున్నట్టుగా ఆఘమేఘాలమీద అటూ ఇటూ మళ్లుతూ వస్తోంది.

ఆ డ్రైవర్ తాగేడేమో!

తాగినవాడి చూపులాగా గుడ్డిగా వెలుగుతున్నాయి హెడ్ లైట్లు. తాగుబోతు శరీరంలో రక్తం తరిగిపోయినట్టుగా వాటికి బ్యాటరీ తగ్గిపోయిందేమో!

నిర్మానుష్యమైన రోడ్డు.

ఆలోచనలతో భారమైన మనస్సు అస్తవ్యస్తమైన నడక.

మరీ మరీ సమీపానికి వస్తోంది లారీ.

'మణీ! నన్ను క్షమించు అత్యాశకి వెళ్లేను. అంతా అప్పులుచేశాను. పోగొట్టాను. నీతి తప్పాను. నియమం తప్పాను. అందుకే జీవనబాటనుంచీ తప్పుకుంటున్నాను.

నా శరీరంలో రక్తంలేదు. బ్రాందీ విస్కీలున్నాయి. ఇపుడు నాకు నాటుసారా తాగితే తప్ప నిషారాదు. నాలో చీమునెత్తురులు లేవు, మానావమానాలు, సిగ్గెగ్గులు పోయాయి. అవి ఆశచేత వచ్చిపోయాయి. నేను యింకా బ్రతికివున్నందువల్ల మీ కన్నీ కష్టాలే! తినేందుకు తిండిలేదు. కట్టేందుకు బట్టలేదు.

అదిగో యమదూతలా లారీవస్తోంది. నేను దాని నుంచి తప్పుకోను. దాని బారి నుంచి తప్పుకోను. జీవితం నుంచే తప్పుకుంటాను. నేను చనిపోతే మీకు ఇన్స్యూరెన్సు

వస్తుంది. పి.యఫ్.వస్తుంది. గ్రాట్యూటీ వస్తుంది. పదివేలు డబ్బు వస్తుంది. పెద్దబ్బాయికి ఉద్యోగం వస్తుంది.

మణీ! అందరికీ నా చావు యాక్సిడెంటు. మన పేదరికం జాలిపుట్టిస్తుంది. బతికినన్నాళ్ళూ అప్పుకోసం ప్రాణాలు తీసిన బాకీదార్లు - నే చనిపోగానే మిమ్మల్ని జాలి తలుస్తారు దయతో అప్పులు వదిలేస్తారు. అపుడు మీరైనా సుఖపడతారు.

కనీసం మీరైనా సుఖపడండి!

జీవచ్ఛవంలా బ్రతికి - అందరితో ఏవగింపబడి- మిమ్మల్ని కష్టపెట్టేకన్నా చనిపోయి పరోక్షంగా మీకు తోడ్పడి మిమ్మల్ని సుఖపెట్టటం మంచిది కాదా? మంచి అనే నేను అనుకుంటున్నాను.

అదిగో లారీ వస్తోంది? హారన్ కొడుతున్నాడు. తప్పుకోమని? తప్పుకోను. జీవితంనుంచే తప్పుకుంటున్నాను.

గుడ్ బై

చనిపోయి అయినా తనవాళ్ళకి మేలు, తనకి యీ బాధల నుంచి విముక్తి లభించాలని ఆశపడి, ఆ ఆశకి బందీ అయ్యాడు చిదంబరం.

కానీ లారీ బ్రేకులు కీచుమంటూ మోగాయి.

రోడ్డుపై అడ్డంగా పడిపోయిన చిదంబరం శరీరానికి అంగుళం దూరంలో ఆగేయి టైర్లు.

అతన్ని తిడుతూ, దేశాన్ని, రోడ్లని తిడుతూ లారీ దిగేడు శ్రీధర్.

చిదంబరం హతాశుడయ్యాడు.

● 1983 యువ దీపావళి ప్రత్యేక సంచిక ●